క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు గిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంది అచ్చిబాబు డిమాండ్ చేశారు. ఇదే విషయమై అచ్చిబాబు ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపట్టానశెట్టిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించి లేఅవుట్లు వేసి కోట్లాది రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అచ్చిబాబు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

డాక్టర్ రవికి సత్కారం


డాక్టర్ రవిని సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట : ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న ఆంధ్రా మెడికల్ కాలేజీ దేశ, విదేశాల్లో స్థిర పడ్డ పూర్వ విద్యార్థులను డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ రవి సిరిపురపు (1991), డాక్టర్ సురేష్ కంకణాల (1992) సెంటినరీ అల్యూమినా బ్లాక్ కోసం సహకరిస్తున్నారు. శుక్రవారం డాక్టర్ రవి సిరిపురపు ఆంధ్రా మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి సిరిపురపును ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజుతో పాటు ఇతర సీఏబీ సభ్యులు డాక్టర్ ఇ.పెదవీరాజు, డాక్టర్ పి.వి. సుధాకర్, డాక్టర్ ఎస్.కె.ఇ. అప్పారావు, డాక్టర్ అపరంజి, డాక్టర్ ఎస్.ఎన్. ఆర్.నవీన్ తదితరులు సత్కరించారు.

మూడేళ్లు దాటిన పిల్లలు అంగన్‌వాడీల్లో ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు

అల్లిపురం: మూడు పుట్టిన రోజులు జరుపుకున్న పిల్లలు అంగన్‌వాడీల్లోనే ఉండాలని కార్యకర్తలు నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన భాగీధారి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారివీధి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యాబోధన చేస్తుందని, వారికి పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. మంచి అలవాట్లు, శాస్త్రీయ పరిజ్ఞానం తదితర అంశాలపై అవగాహన కలిగిస్తూ విద్యాబోధన సాగుతుందన్నారు. ఐసీడీఎస్ ఇచ్చిన ప్రీస్కూల్ మెటీరియల్‌తో చిన్నారులు విద్యను సులువుగా అభ్యసిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసే హ్యాండ్ మెటీరియల్ బోధనలో చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో 33వ వార్డు ఎంఎస్‌కే నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణప్రియ, రాణిపుష్పవల్లి, భారతి, ఆయా కొండమ్మ, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు


పార్కును ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి ,ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన

- ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు పార్కుల అభివృద్ధి
- నగర మేయర్ హరి వెంకట కుమారి
- ఎన్‌ఏడీ లేఅవుట్‌లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో కలిసి పార్కు ప్రారంభం

సింహాచలం: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు పార్కులు అభివృద్ధి చేస్తున్నామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చెప్పారు. జీవీఎంసీ 95వవార్డు ఎన్‌ఏడీ లేఅవుట్‌లో రూ. 82.20 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కును శుక్రవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. అని వార్డుల్లో రోడ్లు, డ్రైన్లతో పాటు పార్కులను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు పార్కులు ఉపయోగపడతాయన్నారు.


పార్కులో మొక్క నాటుతున్న మేయర్ హరి వెంకట కుమారి

143 పార్కుల అభివృద్ధి

ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో 143 పార్కులు అభివృద్ధి చేశామని చెప్పారు. పిల్లలతో పాటు పెద్దలకు పార్కుల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్‌ఏడీ లేఅవుట్‌లో పార్కును అభివృద్ధి చేయడం ద్వారా ఈప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగదాయకంగా ఉంటుందన్నారు. పార్కు అభివృద్ధికి చొరవ చూపిన 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడును అభినందించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు మాట్లాడుతూ ఆదర్శవార్డుగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఏడీ లేఅవుట్‌లో పార్కుకు కాంపౌండ్ వాల్‌తో పాటు జిమ్ ఐటమ్స్, పిల్లల ప్లే ఐటమ్స్, వాచ్‌మెన్ రూమ్, కామన్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వజోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఆర్టికల్చర్ ఎం.దామోదర్, జీవీఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్కు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సొసైటీ ప్రతినిధులు అత్తిలి నాగేంద్రకుమార్, సన్యాసిరావు, సత్యనారాయణ, పాపారావు, చంద్రరాజు, లత, అనిత, 95వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం ఉద్యోగులుపాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పర్యటన

సబ్బవరం: మండలంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30 గంటలకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తారు. అనంతరం పాఠశాల స్థాయిలో పదోతరగతిలో మొదటి 3 స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సత్కరించనున్నారు. ముందుగా ఉదయం 8 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 151 మంది రైతులకు ఎల్‌పీఎం పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హుస్సేన్ సాహెబ్

సింహాచలం: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సూచించారు.పెందుర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 280 మంది బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు, డిప్యూటీ తహసీల్దార్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఉత్తర్వుల ప్రకారం జూలై 21నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌వోలంతా డోర్ టు డోర్ వెరిఫికేషన్ సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం బీఎల్‌వోలు అంతా ఇంటింటి వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. ఓటర్ల యాడింగ్, తొలగింపు, ప్యూరిఫికేషన్ తదితర కార్యక్రమాలు చేయాల్సి ఉంటుందన్నారు.

ఈఆర్‌ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఇంటక్ అదనపు ప్రధాన కార్యదర్శి రాజును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మికవర్గం చురుగ్గా పాల్గొవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాజు కోరారు. ప్రైవేటీకరణ ఉద్యమం ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. శుక్రవారం జరిగిన ఎలక్ట్రికల్ రిపేర్ షాప్ (ఈఆర్‌ఎస్) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగం నూతన కన్వీనర్‌గా పి.వి.రాజు, అధ్యక్షునిగా కె. అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, పి.ఎస్.ఎస్. ప్రసాద్, బి. శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సురేష్, సహాయ కార్యదర్శిగా కె. అప్పలరెడ్డి, కోశాధికారిగా ఎ. నరేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాజును నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్.కోటేశ్వరరావు, ఎం.పైడికొండలరావు, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో వంకర పాదాలు నయం


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

మహారాణిపేట : పుట్టుకతోనే వంకర పాదాలతో ఉన్న పిల్లలకు సరైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌లో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధ్వర్యంలో వంకర పాదాల చికిత్సపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాదాలు వంకరగా ఉన్నాయని భయపడొద్దని తెలిపారు. పలు చికిత్సా విధానాల ద్వారా పాదాలను పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ వంకర పాదాలపై వైద్యులకు కూడా అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, రాణిచంద్రమతి దేవి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి.చక్రవర్తి, డాక్టర్ రుద్ర ప్రసాద్, డాక్టర్ అభిషేక్ తదితరులు కార్యక్రమానికి శిక్షకులుగా వ్యవహరించారు. క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్టు రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి.శిరీషరాణి, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి.జోత్స్న, డాక్టర్ వి.వి. సమత, పి.ప్రియాంక, బి.సాయి కిరణ్, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు. అవసరం అయిన వారు (8800020508) నంబర్‌కు కాల్ చేస్తే చికిత్స అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

హాస్టల్‌లో ‘పంట’ పండింది


హాస్టల్‌లో చెట్టుకు కాసిన మామిడి కాయను వీసీకి బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం విదేశీ విద్యార్థినుల హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు స్వయంగా పలు మొక్కలు నాటి పెంచుతున్నారు. గత సంవత్సరం కొన్ని మామిడి మొక్కలు నాటారు. ఈ సంవత్సరం వీటిలో ఒక మొక్క కాయలు కాయడం ప్రారంభించింది. ఈ మేరకు మొక్కకు కాసిన కాయను పలువురు వియత్నాం విద్యార్థులు ప్రత్యేకంగా తీసుకువచ్చి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి బహూకరించారు. వియత్నాంకు చెందిన పరిశోధకులు, విద్యార్థులు స్వయంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను హాస్టల్ ఆవరణలో సాగు చేస్తున్నారు. తమ దేశానికి సంబంధించిన పలు మొక్కలు సైతం తీసుకువచ్చి ఇక్కడ హాస్టల్ చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో పెంచుతున్నారు. వారి ఆసక్తిని వీసీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ రాజ మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా బుధవారం హెడ్ క్వార్టర్‌లోను, శనివారం పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాన్నంతా పరిశీలించారు. పీహెచ్‌సీ కొత్త భవనం సివిల్ వర్క్స్ కోసం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో గుంతకల్లు ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం ఏఈవో నరసింహరాజు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతుడు

పెదగంట్యాడ: మండలంలోని అరుణా థియేటర్ ఎదురుగా గల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. న్యూపోర్టు సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం .. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఓ వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నట్టు తమకు సమాచారం అందిందని తెలిపారు. ఆ వ్యక్తి ఎవరు, ఎలా మృతి చెందాడో తెలియలేదన్నారు. ఒంటిపై టీషర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించాలన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94409 04309, 85003 87400 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డుపై జారిపడ్డ మొక్కజొన్న విత్తనాలు


మొక్కజొన్న విత్తనాలను తొలగిస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: విశాఖ పోర్టు నుంచి షీలానగర్ సిగ్నల్ పాయింట్ గుండా బీహెచ్‌పీవీ వైపు భారీ వాహనంలో వెళ్తున్న మొక్కజొన్న విత్తనాలు జారి పడి రోడ్డుపై పరుచుకున్నాయి. శుక్రవారం సాయంత్రం నాతయ్యపాలెం శ్రీనివాస కల్యాణ మండపం ఎదురుగా జరిగిన ఈ సంఘటనతో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ యూసఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై మొక్కజొన్న విత్తనాలను సిబ్బంది సహాయంతో తొలగించారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

మల్కాపురం: తన తల్లి కనిపించడం లేదని ఆమె కుమార్తె ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం బర్మాక్యాంప్ దరి ఏఎస్సార్ నగర్‌లో కర్రి ఆదిలక్ష్మి(66) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 14 నుంచి ఆమె కనిపించడం లేదు. చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆదిలక్ష్మి కుమార్తె సూర్యకుమారి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన ఎడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న భరోసా


మెరిట్ విద్యార్థులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పది, ఇంటర్ టాపర్లకు నగదు బహుమతుల అందజేత

పరవాడ: విద్యార్థులను చదువులో మరింత ప్రోత్సహించడమే జగనన్న ఆణిముత్యాలు లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెన్నలపాలెం కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు భరోసా కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. పెందుర్తి నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలుగా గుర్తించి వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకోవాలని అప్పుడే నేటి పోటీ యుగంలో విజేతలుగా నిలుస్తామని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదనే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు చొప్పున వి అందజేశారు. ఇంటర్‌లో నాలుగు గ్రూపుల్లో సత్తా చాటిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందజేశారు. విద్యార్థులతో పాటు ఆ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చల్లా కనకారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఎంఈవో సునీత, ఆర్‌ఐఓ ఆర్.సత్యనారాయణ, పెందుర్తి ఎంఈవో పైడింనాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ హెచ్‌ఎంలకు సత్కారం


బదిలీ అయిన హెచ్‌ఎంలను సత్కరిస్తున్న ఎంఈవో సునీత తదితరులు

పరవాడ: మండంలో పనిచేసి సాధారణ బదిలీల్లో వేరే పాఠశాలలకు వెళ్లిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. లంకెలపాలెం క్లస్టర్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరవాడ (బాలురు) సురేఖ, వాడచీపురుపల్లి హైస్కూల్ హెచ్‌ఎం కర్రి జగన్మోహన్ నాయుడు, పరవాడ (బాలికలు) హెచ్‌ఎం కుమారిలను సన్మానించారు. ఎంఈవో ఎం.సునీత మాట్లాడుతూ మండలంలో అన్ని కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తి కావడానికి హెచ్‌ఎంలు సహకారం అందించారన్నారు. బదిలీపై పరవాడ మండలానికి వచ్చిన హెచ్‌ఎంలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో పరవాడ నోడల్ హెచ్‌ఎం రమణాజీ, క్లస్టర్ హెచ్‌ఎంలు రౌతు నాగేశ్వరరావు, తానాం రెసిడెన్షియల్ పాఠశాల హెచ్‌ఎం ఎం.అప్పలనాయుడు, వాడచీపురుపల్లి హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, ముత్యాలమ్మపాలెం హెచ్‌ఎం మూర్తి, ధర్మారాయుడుపేట పాఠశాల ప్రసన్న, దేశపాత్రునిపాలెం పాఠశాల హెచ్‌ఎం సుజాత, లేమర్తి హైస్కూల్ హెచ్‌ఎం అమ్మాజీ, రమణ, సుధకార్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు భరోసా


దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: దిశ యాప్ మహిళలకు అన్ని వేళలా రక్షణగా నిలుస్తుందని సీఐ రంగనాథం అన్నారు. అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సీఐ రంగనాథం సిబ్బందితో కలిసి మహిళలకు దిశయాప్ ఉపయోగాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. దిశ యాప్‌ను మహిళలంతా తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ వినియోగం,ఉపయోగాలపై షాపింగ్ మాల్స్‌లో, కూడళ్లు, కళాశాలల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి అక్రమ రవాణా,కోడిపందాలు,రోడ్డు ప్రమాదాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎల్ సురేష్,వెంకటేశ్వరరావు,మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశ బొప్పాయి మొక్కల పెంపకం


మొక్కకు నీరు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెండో దశ బొప్పాయి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఉక్కునగరంలోని నాలుగు ఎకరాల్లో ఉన్న పండ్ల తోట మధ్యస్థలంలో 1500 మొక్కలను నాటడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగం సీజీఎం వై. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని కాపాడుతూ, ఉన్న భూమిలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ఆగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆగ్రోఫారెస్ట్ విభాగాధిపతి వి.ఎల్.పి. లాల్ తదితరులు పాల్గొన్నారు.

కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం


కాళీ కాలభైరవులకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో కాళీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పీఠం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిపించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.